# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 13, ఆగస్టు 2026




## వాచ్‌మెన్‌ను సస్పెండ్ చేయాలని

# రోడ్డుపై బైఠాయింపు

**జైనూర్, ఆగస్టు 12, ప్రభాతవార్త:**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలోని పోచంలొద్ది కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) వాచ్‌మెన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థినులు ఆందోళనకు దిగారు. వాచ్‌మెన్ తమను అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని, తమపై లేనిపోని నిందలు వేస్తున్నారని ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థినులు ఆరోపించారు. ఈ మేరకు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. సదరు వాచ్‌మెన్‌పై తక్షణమే చర్యలు తీసుకుని, సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థినుల ఆందోళనతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలని విద్యార్థినులు కోరారు.




# అర్హులందరికీ పారదర్శకంగా చేయూత పింఛన్లు అందించాలి

● ఆగస్టు 31 వరకు కొత్త దరఖాస్తుల స్వీకరణ ● అధికారులతో కలెక్టర్ భవేష్ మిశ్రా ఉన్నతస్థాయి సమీక్ష

**నిర్మల్, ఆగస్టు 12, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పింఛన్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా, వేగవంతంగా పింఛన్లు అందాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పథకాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. చేయూత పింఛన్లతో పాటు ఇందిరమ్మ ఇండ్లు, వనమహోత్సవం, తెలంగాణ జలసిరి కార్యక్రమాల పురోగతిని పరిశీలించారు. నూతన చేయూత పింఛన్లకు ఆగస్టు 31 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, అర్హులెవరూ మిగిలిపోకుండా చొరవ తీసుకోవాలని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలు గ్రామ పంచాయతీ కార్యదర్శి లేదా ఎంపీడీవో కార్యాలయంలో, పట్టణ ప్రజలు మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను తక్షణమే ప్రారంభించి గడువులోగా పూర్తి చేయాలని, వనమహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించాలని అధికారులను ఆదేశించారు. జలసిరి కింద సోక్ పిట్లు, బోర్‌వెల్లు, ఫామ్ పాండ్ల పనులు వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని, ఉల్లంఘించిన వారిపై భారీ జరిమానాలు విధించి సీజ్ చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు రవిబాబు, సుందర్ సింగ్, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

# నకిలీ పత్తి విత్తనాల అక్రమ రవాణా గుట్టురట్టు

**ఆసిఫాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త :**




నకిలీ పత్తి విత్తనాలను అక్రమం గా రవాణా చేస్తున్న ఇద్దరిని పట్టుకున్నట్లు బుధవారం ఎస్హెచ్ఓ రవి పేర్కొన్నారు. ఎస్హెచ్ఓ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 11 రాత్రి ముందస్తు సమాచారం మేరకు ఆదిలాబాద్ ఎక్స్‌రోడ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించగా కియా కారులో సుమారు రూ.4 లక్షల విలువైన 200 కిలోల అనుమానిత నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. ఈ కేసులో షేక్ సల్మాన్ (29), వెంకటగోపాల్ రెడ్డి (53)లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. పట్టుకున్న నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్హెచ్ఓ మాట్లాడుతూ నకిలీ విత్తనాలను అధిక దిగుబడి విత్తనాలుగా నమ్మించి రైతులకు విక్రయిస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. విత్తనాలతో పాటు రవాణాకు ఉపయోగించిన కారును, మొబైల్ ఫోన్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. రైతులు విత్తనాలను అధీకృత డీలర్ల వద్ద మిగతా 2లో..

# చేపల పెంపకం ద్వారా మహిళా సంఘాలకు అదనపు ఆదాయం

**కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 12, ప్రభాతవార్త :**

స్వయం సహాయక సంఘాల మహిళలు చేపల పెంపకం, డైరీ ఫాంల ఏర్పాటు ద్వారా అదనపు ఆదాయం పొందాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని లింగాపూర్ మండలం జాముల్ ధార గ్రామంలో ప్రధానమంత్రి కృషి సించాయి యోజనలో మిగతా 2లో..



# పోలీస్ వాహనాల నిర్వహణపై సీపీ ప్రత్యేక దృష్టి



✪ ప్రజాసేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా వాహనాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలి

ః రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**మంచిర్యాల, ఆగస్టు 12, ప్రభాతవార్త**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల పోలీస్ స్టేషన్లకు చెందిన పోలీస్ వాహనాల పనితీరు, నిర్వహణపై పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ వాహనాలను ఆయన స్వయంగా క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాల పనితీరుతో పాటు సమాచార ప్రసార పరికరాల పనితీరును పరిశీలించారు. పోలీస్ సేవలకు వాహనాలు అత్యంత కీలకమని, అత్యవసర సమయాల్లో ఎలాంటి ఆటంకం లేకుండా వాహనాలు అందుబాటులో ఉండేలా పటిష్టమైన నిర్వహణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పోలీస్ వాహనంలో ప్రథమ చికిత్స పెట్టె, అత్యవసర దీపం, తాళ్లు, ట్రాఫిక్ కోన్లు, నేరస్థల రక్షణ రిబ్బన్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని సూచించారు. అదేవిధంగా హెల్మెట్లు, రాళ్ల దాడుల నుంచి రక్షణ కవచాలు, లాఠీలు, శరీర రక్షణ కవచాలు, ప్రతిఫలించే భద్రతా జాకెట్లు వంటి రక్షణ సామగ్రి కూడా వాహనాల్లో సిద్ధంగా ఉంచాలని మిగతా 2లో..

# చేపల పెంపకం ద్వారా మహిళా సంఘాలకు అదనపు ఆదాయం

(మొదటిపేజీ తరువాయి)

భాగంగా వాటర్ షెడ్ డెవలప్మెంట్ కాంపోనెంట్ క్రింద గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పంట కుంట, ఊట కుంటలలో స్వయం సహాయక మహిళ సంఘాల అనుసంధానంతో చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి ప్రత్యేక కమిషనర్ శ్రీలక్ష్మి, జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ లతో కలిసి పాల్గొని చేప పిల్లలను ఊట కుంటలలో వదిలారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్నినో ప్రభావంతో పలు ప్రాంతాలలో లోటు వర్షపాతం నమోదు అవుతున్నందున వివిజి రామ్జి పథకం ద్వారా భూగర్భ నీటిమట్టం పెరుగుదల కొరకు ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసి పట్టేందుకు ఇంకుడు గుంతలు, ఊట కుంటలు, పంట కుంటల నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. కుంటలలో నీరు నిలవడం ద్వారా మహిళా సంఘాల సభ్యులు చేప పిల్లల పెంపకంతో అదనపు ఆదాయాన్ని పొందడమే కాకుండా భూగర్భ నీటి మట్టాన్ని పెంపొందించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పెద్ద ఎత్తున ఊట కుంటలు, పంట కుంటల నిర్మాణాలు చేపట్టడం ద్వారా అర్హులైన కూలీలకు పని దినాలు లభిస్తాయని, స్వయం సహాయక సంఘాల సభ్యులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని తెలిపారు. ఆసిఫాబాద్ శాసనసభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి అనేక చర్యలు చేపడుతుందని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను స్వయం సహాయక సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మహిళ సంఘాలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు విభిన్న రంగాలలో రాణించాలని, ప్రతి ఒక్క మహిళ స్వయం సహాయక సంఘంలో చేరాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, సర్పంచ్ లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

# దివాకర్‌రావు పాలనతోనే మంచిర్యాల అభివృద్ధి వెనుకబాటు

## ఎల్లంపల్లి నిర్వాసితులు, రైతుల సమస్యలపై మాజీ ఎమ్మెల్యే వైఫల్యం: నగునూరి వెంకటేశ్వర్ గౌడ్

**మంచిర్యాల, ఆగస్టు 12, ప్రభాతవార్త**




మంచిర్యాల నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడటానికి మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు దీర్ఘకాల పాలనా వైఫల్యమే కారణమని భారతీయ జనతా పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఆరోపించారు. భారత రాష్ట్ర సమితి నాయకుడు విజిత్ రావు ఇటీవల భారతీయ జనతా పార్టీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లిపై చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు సాధనలో దివాకర్ రావు చేసిన పోరాటం ఏమిటో ప్రజలకు వివరించాలని ప్రశ్నించారు. నిర్వాసితులకు పెండింగ్ పరిహారం చెల్లింపులోనూ ఆయన చిత్తశుద్ధి చూపలేదని విమర్శించారు. రైతుల సమస్యలపై రఘునాథ్ వెరబెల్లి దండేపల్లి నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేసి పోరాడారని తెలిపారు. గూడెం ఎత్తిపోతల పథకం పైపుల మార్పు కోసం కూడా అనేక ఆందోళనలు నిర్వహించారని పేర్కొన్నారు. రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చే అంశంపై భారత రాష్ట్ర సమితి నేతలు సలహాలు ఇవ్వాల్సిన అవసరం లేదని అన్నారు. ఇకపై భారతీయ జనతా పార్టీ లేదా రఘునాథ్ వెరబెల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తుందని, మంచిర్యాలలో రఘునాథ్ వెరబెల్లి విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెద్దపల్లి పురుషోత్తం, వంగపల్లి వెంకటేశ్వర్ రావు, జయరామ రావు, కమలాకర్ రావు, కుర్రే చక్రవర్తి, రంగ శ్రీశైలం, ఆడే ప్రేమ్ సింగ్, కల్వచర్ల అనీల్, దేవరకొండ వెంకన్న, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

# అర్బన్ పార్కులతో పాటు బెల్లంపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలి

**బెల్లంపల్లి, ఆగస్టు 12, ప్రభాతవార్త**



బెల్లంపల్లి నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను పరిష్కరించకుండా కొత్తగా అర్బన్ పార్కుల పేరుతో నిధులు ఖర్చు చేయడం కంటే, ప్రజలకు అత్యవసరమైన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. బెల్లంపల్లి నియోజకవర్గంలోని గ్రామాలు, పట్టణాల్లో అధ్వానంగా ఉన్న రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరింది. ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. బెల్లంపల్లి ప్రాంతం సింగరేణి కార్మికుల కృషితో అభివృద్ధి చెందిన ప్రాంతమని, ఇక్కడి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే శాశ్వత అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉందని కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. ప్రజలకు అత్యవసరమైన మౌలిక సదుపాయాల కల్పనను పక్కనపెట్టి పార్కుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం సమంజసం కాదన్నారు. ముందుగా ప్రజల సమస్యలు పరిష్కరించండి ఆ తర్వాత పార్కుల గురించి ఆలోచించండి అనే డిమాండ్‌తో ప్రజాప్రతినిధులు, అధికారులు బెల్లంపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టిఎన్టియుసి రాష్ట్ర కార్యదర్శి టీ.మణిరామ్ సింగ్, సింగరేణి గని కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు అంబాల మహేందర్, ఏఐఎఫ్టియు రాష్ట్ర కార్యదర్శి ఎం. పోచమల్లు తదియురులు పాల్గొన్నారు.

# ఘనంగా వన మహోత్సవం

**బెల్లంపల్లి, ఆగస్టు 12, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెల్లంపల్లి పట్టణంలోని ప్రభుత్వ 100 పడకల ఏరియా ఆసుపత్రి ఎదుట ఉన్న ఓపెన్ మైదానంలో బుధవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించాలనే లక్ష్యంతో సుమారు 100 మొక్కలను నాటారు. నాటిన మొక్కల సంరక్షణ కోసం ట్రీ గార్డులను కూడా ఏర్పాటు చేశారు. మొక్కలను నిరంతరం సంరక్షిస్తూ వాటిని పెద్ద వృక్షాలుగా పెంచేందుకు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు బాధ్యత తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ దావ స్వాతిరమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ రమేష్, మున్సిపల్ కౌన్సిలర్లు రాజ్ కుమార్, పున్నం చందు, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ఆసుపత్రి పారామెడికల్ సిబ్బంది పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించడంతో పాటు ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు రంగ రామన్న, కంటెవాడ నాగేష్ కుమార్, కజ్జం రమేష్, రత్నం ఐలయ్య, గెల్లీ జయరాం యాదవ్, రత్నం రాజన్న, భోగ శ్రీనివాస్, పి. రాజనర్స్, నాగుల లింగయ్య, భీముని కనకయ్యగౌడ్, కందుల సత్తయ్య, ఏనుగు నరేష్, పాంచాలపు శ్రీనివాస్, పుల్లూరి సత్యనారాయణ, ముత్తే వెంకట్ రాజం, తిప్పారపు రాజయ్య, తిప్ప శ్రీనివాస్, బాల ప్రశాంత్, కొయ్యడ శంకర్ గౌడ్, డోలి సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ పత్తి విత్తనాల అక్రమ రవాణా గుట్టురట్టు

(మొదటిపేజీ తరువాయి)

మాత్రమే కొనుగోలు చేసి తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని, నకిలీ విత్తనాల విక్రయం, రవాణా సమాచారం ఉంటే పోలీసులకు గాని వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ వాహనాల నిర్వహణపై సీపీ ప్రత్యేక దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టం చేశారు. వాహనాల నిర్వహణలో తలెత్తే లోటుపాట్లను ఎప్పటికప్పుడు గుర్తించి వెంటనే సరిదిద్దాలని, ప్రతి వాహనాన్ని సమగ్రంగా తనిఖీ చేసి నెలవారీ నివేదికను సమర్పించాలని మోటారు వాహనాల అధికారులను ఆదేశించారు. పోలీస్ వాహనాలను సొంత వాహనాల మాదిరిగా బాధ్యతతో, జాగ్రత్తగా నిర్వహించాలని డ్రైవర్లకు సూచించారు. నిర్ణీత వ్యవధిలో వాహనాలకు మరమ్మతులు చేయడంతో పాటు ఇంజిన్ నూనె మార్పు, టైర్ల నిర్వహణ తదితర అంశాల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సీపీ తెలిపారు. వాహనాల నిర్వహణ, పనితీరు, భద్రతా ప్రమాణాలపై డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు వేగవంతమైన, సమర్థవంతమైన పోలీస్ సేవలు అందించేందుకు వాహనాలు ఎల్లప్పుడూ మంచి స్థితిలో, పూర్తి సన్నద్ధతతో ఉండేలా చర్యలు తీసుకోవాలని సీపీ స్పష్టం చేశారు.

# మహిళా సంఘాలకు చేప పిల్లల పంపిణీ

**లింగాపూర్, ఆగస్టు12, ప్రభాతవార్త:**

లింగాపూర్ మండలంలో వాటర్ షెడ్ పథకంలో భాగంగా జాముల ధర, చోర్పల్లి ఆరు గ్రామాలలో వాటర్ షెడ్ పథకం అమలు చేయడం జరిగింది. జముల్దార గ్రామపంచాయతీలో 540 ఎకరాలలో వాటర్ షెడ్ ప్రాజెక్టు కింద ఒక కోటి51 లక్షల నిధులను మంజూరు చేయడం జరిగింది. దీనిలో సహజ వనరుల సంరక్షణ కింద జాములధర, చోర్పల్లి గ్రామపంచాయతీలో ఒక కోటి 55 లక్షల నిధులతో గత ఐదు సంవత్సరాలలో 21 ఊట కుంటలు, విడురాళ్ల కట్టలుల, రాతి డ్యాముల నిర్మాణ పనులు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే కోవా లక్ష్మి, జిల్లా కలెక్టర్ కె హరిత, స్పెషల్ కమీషనర్ లక్ష్మి రెడ్డి , అడిషనల్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్, జిల్లాపంచాయతీ అధికారి దత్తారం, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్ వాటర్ షెడ్ ప్రాజెక్టు ఆఫీసర్ కె ఆంజనేయులు, ఎంపీడీఓ, ఎమ్మార్వో, పంచాయతీ కార్యదర్శి, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ సూర్యకాంత్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ చంద్రశేఖర్, జాములధర గ్రామ పంచాయతీ సర్పంచ్ జుగ్నక గంగాదేవి రమేష్, జాదవ్ రాజశేఖర్ లింగాపూర్ సర్పంచ్, గ్రామ మహిళా సన్నఘ సభ్యులు, వాటర్ షెడ్ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు హాజరు కావడం జరిగింది.

# ఎస్పీయం, స్పర్ష్ సోషల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

## - 142 మందికి వైద్య పరీక్షలు.. ఉచితంగా మందుల పంపిణీ

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 12, ప్రభాతవార్త :**





గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో సిర్పూర్ పేపర్ మిల్లు (ఎస్పీఎం), స్పర్ష్ సోషల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ మండలం చింతగూడ గ్రామంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. డాక్టర్ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 142 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు, షుగర్, జ్వరం తదితర సమస్యలతో పాటు సాధారణ ఆరోగ్య సమస్యలను పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామ ప్రజలకు ఆరోగ్య పరిరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం ప్రాముఖ్యతపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎస్పీఎం, స్పర్ష్ సోషల్ ఫౌండేషన్ సంయుక్తంగా ఇలాంటి వైద్య శిబిరాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని తెలిపారు. గ్రామంలో వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఉచిత వైద్య శిబిరం ద్వారా తమకు ఎంతో ఉపయోగకరమైన సేవలు అందించారని గ్రామస్థులు నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి ఆకాష్, పంచాయతీ కార్యదర్శి అంజలి, వార్డు సభ్యులు సాయిప్రకాష్, భీమ్‌రావు, స్పర్ష్ సోషల్ ఫౌండేషన్ ప్రతినిధులు సుశీల, శివకుమార్, వైద్య సిబ్బంది తస్నీరు విజయ్‌కుమార్, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

# అర్హులందరికీ పారదర్శకంగా చేయూత పింఛన్లు అందించాలి: కలెక్టర్

**భైంసా, ఆగస్టు 12, ప్రభాతవార్త:**



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పింఛన్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా, వేగవంతంగా పింఛన్లు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన చేయూత పింఛన్ల కోసం ఆగస్టు 31 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమం చేరేలా అధికారులు శ్రద్ధ వహించాలని తెలిపారు. అందిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు గ్రామ పంచాయతీ కార్యదర్శి లేదా ఎంపీడీవో కార్యాలయంలో, పట్టణ ప్రజలు మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే ప్రారంభించి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వనమహోత్సవంలో భాగంగా నాటిన మొక్కల సంరక్షణపై దృష్టి పెట్టాలని, తెలంగాణ జలసిరి కింద సోక్ పిట్లు, బోర్‌వెల్లు, ఫామ్ పాండ్ల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలు జరిపితే దుకాణాలను సీజ్ చేసి భారీ జరిమానాలు విధించాలని అధికారులను సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు రవిబాబు, సుందర్ సింగ్, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.





## గుంతలమయంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రహదారి

**బజార్‌హత్నూర్, ఆగస్టు 12, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి తీవ్ర నిరక్ష్యాన్లికి గురైంది. వర్షపు నీరు రోడ్డుపై ఉన్న గుంతల్లో చేరి చెరువులను తలపిస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వచ్చే గర్భిణులు, చిన్న పిల్లలు, వృద్ధులు ఈ రోడ్డుపై ప్రయాణించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, అంబులెన్సులు గుంతలలో దిగబడి వెళ్లాల్సి వస్తోంది. నిలిచిన నీటి వల్ల దోమలు వ్యాప్తి చెంది రోగాలు సంభవించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేపట్టి, నూతన రోడ్డు నిర్మించి రవాణా ఇబ్బందులను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

### - తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేసిన యూఎస్‌పీసీ ఉపాధ్యాయ సంఘం

**బజార్‌హత్నూర్, ఆగస్టు 12, ప్రభాతవార్త:**

రాష్ట్రంలో పాఠశాలలు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) డిమాండ్ చేసింది. రాష్ట్ర స్థాయి పిలుపు మేరకు చేపట్టిన రెండో దశ పోరాటంలో భాగంగా బుధవారం బజార్ హత్నూర్ తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు భగత్ బాపూరావు, ప్రధాన కార్యదర్శి పాముల మల్లయ్య మాట్లాడుతూ.. విద్యారంగంలో నెలకొన్న సమస్యల వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## బాసర ఆర్జీయూకేటీలో ఘనంగా జాతీయ గ్రంథాలయ అధికారుల దినోత్సవం

**భైంసా, ఆగస్టు 12, ప్రభాతవార్త:**



బాసర ఆర్జీయూకేటీ (ట్రిపుల్ ఐటీ) సెంట్రల్ లైబ్రరీలో జాతీయ గ్రంథాలయ అధికారుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. భారత గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఏ. గోవర్ధన్, ఓఎస్డీ ప్రొఫెసర్ ఇ. మురళీధర్శన్ ముఖ్య అతిథులుగా హాజరై రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వీసీ గోవర్ధన్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమగ్ర వికాసంలో పఠనాభిరుచికి, గ్రంథాలయాలకు ఉన్న ప్రాధాన్యాన్ని వివరించారు. నిరంతర అభ్యసనం, పరిశోధనలకు గ్రంథాలయాలు కేంద్రబిందువులని ఓఎస్డీ మురళీధర్శన్ పేర్కొన్నారు. లైబ్రరీకి పుస్తకాలు విరాళంగా అందించిన విద్యార్థులతో పాటు, నిత్యం గ్రంథాలయాన్ని వినియోగిస్తున్న విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. లైబ్రరీ ఇన్‌చార్జి డాక్టర్ కె. అరుణజ్యోతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్‌కు జన్మదిన వేడుకలు

**బెల్లంపల్లి, ఆగస్టు 12, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని మాదిగ హక్కుల దండోరా నాయకులు బెల్లంపల్లి పట్టణంలోని ఆయన స్వగృహంలో కలిసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేయించి, శాలువాతో సన్మానించి, పూల మొక్కను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రేణికుంట్ల ప్రవీణ్ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, ప్రజా సేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని మాదిగ హక్కుల దండోరా నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చిలుక రాజనర్సు, జిల్లా కమిటీ సభ్యులు పెద్ది రాజన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుంగపిండి గంగాధర్, నియోజకవర్గ అధ్యక్షులు కల్లేపల్లి నవీన్, పట్టణ అధ్యక్షులు ఎనగందుల శివాజీ, సీనియర్ నాయకులు దాసరి బానయ్య, పట్టణ ఉపాధ్యక్షులు బొగే రాజయ్య, పట్టణ కార్యదర్శులు మహేష్, సుంకు ఐలయ్య, రత్నం శేఖర్, కడపాక శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ బడుల్లో వసతులు మెరుగుపరచాలి

### ప్రైవేట్ స్కూళ్ల అధిక ఫీజులపై చర్యలు తీసుకోండి: బీఆర్ఎస్వీ

**నిర్మల్, ఆగస్టు 12, ప్రభాతవార్త:**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని, ప్రైవేట్ పాఠశాలలు వసూలు చేస్తున్న అధిక ఫీజులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వీ డిమాండ్ చేసింది. బీఆర్ఎస్వీ జిల్లా ఉపాధ్యక్షుడు షోయబ్ మిర్జా బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదులు, ఫర్నిచర్, డిజిటల్ తరగతుల వంటి ప్రాథమిక సదుపాయాలు లోపించాయన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఈ వసతులను వెంటనే మెరుగుపరచాలని కోరారు. అలాగే కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ట్యూషన్ ఫీజుతో పాటు పుస్తకాలు, యూనిఫాం, ఐడెంటిటీ కార్డుల పేర్లతో అదనపు మొత్తాలు వసూలు చేస్తూ నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని, తక్షణమే చర్యలు తీసుకోకుంటే బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగరవేయాలి

### - బీజేపీ మండల అధ్యక్షుడు కాల్వ నరేష్

**సారంగాపూర్, ఆగస్టు 12, ప్రభాతవార్త:**

ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగా అభియాన్‌ను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కాల్వ నరేష్ కోరారు. ఆగస్టు 12 నుంచి 14 వరకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై కుటుంబ సభ్యులతో కలిసి జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. జాతీయ జెండాతో ప్రతి భారతీయుడికి ప్రత్యేక అనుబంధం ఉందన, అది దేశ ప్రగతికి కృషి చేయడానికి స్ఫూర్తినిస్తుందన్నారు. ఇళ్లపై ఎగురవేసిన జాతీయ జెండాతో ఫోటో దిగి సామాజిక మాధ్యమాల్లో పంచుకోవాలని సూచించారు. ప్రధాని మోదీ కలలు కన్న వికసిత భారత ప్రయాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. అలాగే గురువారం నిర్మల్‌లో ఉదయం 10 గంటలకు జరగబోయే తిరంగా ర్యాలీకి ప్రతి గ్రామం నుండి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని సారంగాపూర్ మండల బీజేపీ శ్రేణులకు సూచించారు.

## అర్హులందరికీ చేయూత పింఛను అందించాలి

**బజార్‌హత్నూర్, ఆగస్టు 12, ప్రభాతవార్త:**



మండలంలోని అర్హులందరికీ చేయూత పింఛను అందించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు బుధవారం తహసిల్దార్ కే. శ్యామ్ సుందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల నాయకుడు డుబ్బుల చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నూతన పింఛను విధానంలో లోపాలను ఎత్తిచూపారు. ఎన్నికల సమయంలో పింఛను రూ.2,000 నుంచి రూ.4,000కు పెంచుతామని, అలాగే ప్రతి కుటుంబానికి రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు కొందరికే ఇస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వృద్ధులు, బీడీ కార్మికులు ఏళ్ల తరబడి పింఛన్లు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి హామీ ఇచ్చిన ప్రకారం వృద్ధులు, బీడీ కార్మికులకు తక్షణమే పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పరచ సాయన్న, నాయకులు చట్ల వినీల్, గంగయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



డీఎంహెచ్ఓ నరేంద్ర రాథోడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ ఎగ్గెన శ్రీనివాస్, ఫిజియోథెరపిస్టులు

## రిజిస్ట్రేషన్ లేని ఫిజియోథెరపీ క్లినిక్‌లపై కఠిన చర్యలు: డీఎంహెచ్ఓ

**- డీఎంహెచ్ఓ డాక్టర్ నరేంద్ర రాథోడ్‌కు వినతిపత్రం అందజేసిన ఫిజియోథెరపిస్టులు**

నస్పూర్, ఆగస్టు 12, ప్రభాతవార్త

జిల్లాలో ఎలాంటి రిజిస్ట్రేషన్ లేకుండా ఫిజియోథెరపీ ఆసుపత్రులు, క్లినిక్‌లు నడిపితే చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేంద్ర రాథోడ్ హెచ్చరించారు. మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం జిల్లాలోని ప్రైవేట్ ఫిజియోథెరపిస్టులు, రాష్ట్ర వైద్య కౌన్సిల్ సంచాలకుడు డాక్టర్ ఎగ్గెన శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎంహెచ్ఓను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, ప్రత్యేక ఫిజియోథెరపీ క్లినిక్‌లు నడిపిస్తున్న ఫిజియోథెరపిస్టులందరూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో తమ వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా కార్యకలాపాలు సాగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. త్వరలోనే జిల్లాలోని అన్ని ఫిజియోథెరపీ క్లినిక్‌లను క్షేత్రస్థాయిలో సందర్శించి తనిఖీలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అనిల్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, ఫిజియోథెరపిస్టులు సురేందర్, అజయ్, శ్యాంసుందర్, తేజస్విని, ఓదెలు, అనిల్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణి ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**- సంస్థ లాభాలు వెంటనే ప్రకటించాలి**

**- సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి**

నస్పూర్, ఆగస్టు 12, ప్రభాతవార్త

గత ఆర్థిక సంవత్సరం పూర్తయి నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు సంస్థ లాభాలు ప్రకటించకపోవడం సరికాదని, తక్షణమే లాభాలను వెల్లడించి కంపెనీ ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం శ్రీరాంపూర్‌లోని యూనియన్ కార్యాలయంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయనతో పాటు ఉప ప్రధాన కార్యదర్శి రాజేందర్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో సంస్థ అభివృద్ధి పేరిట సుమారు రూ. 6,000 కోట్లు పక్కన పెట్టిన యాజమాన్యం, ఆ నిధులతో ఎంతమేర అభివృద్ధి పనులు చేపట్టిందో స్పష్టం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్మికులకు నాణ్యమైన బూట్లు, బిట్లు, డ్రిల్ రాడ్లు, హాలేజ్ రోప్‌లు, రెయిన్ కోట్లు, సెక్యూరిటీ సిబ్బందికి యూనిఫాం వంటి రక్షణ పరికరాలను సమయానికి అందించడంలో అధికారులు విఫలమవుతున్నారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికుల వేతనాల నుంచి రికవరీ చేసిన సీఎంపీఎఫ్ సొమ్మును ఖాతాల్లో జమ చేస్తున్నప్పటికీ, వివరాలు అప్‌డేట్ చేయకపోవడం సీఎంపీఎఫ్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని, దీనిపై సింగరేణి అధికారులు బాధ్యత తీసుకుని కార్మికులకు పేస్లిప్పులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ నాయకులు వెంగల శ్రీనివాస్, సాయిళ్ల శ్రీనివాస్, తోడే సుధాకర్, మీడివెల్లి శ్రీనివాస్, వెంకట రెడ్డి, పేరుక సదానందం, సిరికొండ శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల సంబంధిత దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**

మంచిర్యాల బ్యూరో, ఆగస్టు 12, ప్రభాతవార్త



జిల్లాలో నెలకొన్న భూ సమస్యల సంబంధిత దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని భీమారం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కేటాయించిన భూసమస్యపై విచారణ నిర్వహించి, తహసిల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న సాదా బైనమా, భూభారతి, రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను రికార్డులను అనుసరించి పరిశీలించాలని, క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి పరిష్కరించాలని తెలిపారు. పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి, నిబంధనల మేరకు సత్వరమే పరిష్కారానికి కృషి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కోటపల్లి మండల తహసీల్దార్‌తో కలిసి మండలంలోని ఎం.ఎల్.ఎస్. పాయింట్‌ను తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యం సరఫరాపై వివరాలను పరిశీలించి రేషన్ డీలర్లకు బియ్యం సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పిడిఎస్ బియ్యం సరఫరా ప్రక్రియను పర్యవేక్షిస్తూ, అవసరమైన మేరకు సకాలంలో సరఫరా జరిగేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహసిల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

బెల్లంపల్లి, ఆగస్టు 12, ప్రభాతవార్త




బెల్లంపల్లి ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ స్నేహపూర్వక ఎన్నికలు స్థానిక తాపీ మేస్త్రి భవన్‌లో నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఒకే ప్యానెల్ నామినేషన్ దాఖలు చేయడంతో పోటీ లేకుండానే నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆకుల వేణు, ప్రధాన కార్యదర్శిగా గజెల్లి రఘు, కోశాధికారిగా మడపు విక్రమ్ ఎన్నికయ్యారు. నామినేషన్ పత్రాలను పరిశీలించిన అనంతరం ఎన్నికల నిర్వాహకులు వీరిని విజేతలుగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా ఫోటో అండ్ వీడియోగ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పసు రామన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతరవేణి శ్వాస తిరుపతి, రాష్ట్ర కార్యదర్శి శ్రీపతి రవి, జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌కే ఆకునూరి రాజకుమార్, జిల్లా కుటుంబ భరోసా ఇన్‌చార్జి నూనె సురేష్, జిల్లా కార్యదర్శి రుక్కుమ్ ప్రసాద్తో పాటు బెల్లంపల్లి అసోసియేషన్‌కు చెందిన ఫోటో, వీడియోగ్రఫీ మిత్రులు పాల్గొన్నారు. ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన బెల్లంపల్లి ఫోటో, వీడియోగ్రఫీ మిత్రులకు జిల్లా అసోసియేషన్ తరఫున నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నూతన కార్యవర్గం ఫోటో, వీడియోగ్రఫీ రంగానికి చెందిన సభ్యుల సంక్షేమం కోసం సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

## 500 మీటర్ల జాతీయ జెండాతో బీజేపీ తిరంగా ర్యాలీ

బెల్లంపల్లి, ఆగస్టు 12, ప్రభాతవార్త



భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు బెల్లంపల్లి పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో 500 మీటర్ల భారీ జాతీయ జెండాతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. పట్టణ బీజేపీ అధ్యక్షురాలు ధార కళ్యాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో మంచిర్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, తిరంగా ర్యాలీ పట్టణ ఇన్‌చార్జి అమురాజుల శ్రీదేవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్రం కోసం త్యాగాలు చేసిన మహనీయుల స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని సూచించారు. నేటి బాలలే రేపటి పౌరులని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ దేశ అభివృద్ధిలో క్రియాశీలకంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని నాయకులు పేర్కొన్నారు. దేశ సమైక్యతను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. భారీ జాతీయ జెండాతో నిర్వహించిన ర్యాలీ పట్టణంలో దేశభక్తి వాతావరణాన్ని నెలకొల్పింది. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కొండబాబు లక్ష్మీనారాయణ, కాసర్ల తిరుపతి, కొయ్యల ఏమాజీ, పులగం తిరుపతి, బుల్‌రెడ్డి కేశవరెడ్డి, జిల్లా కార్యదర్శి రాచర్ల సంతోష్‌కుమార్, మధ్యర్ల శ్రీనివాస్, దూది ప్రకాష్, శనిగారపు శ్రావణ్, నర్సింగ్ గోమాస కమల, నల్లుల సంగీత, కళ్లపల్లి నవీన్, జీదుల రాములు, భాషబోయిన యుగేందర్, గంధం అనిల్, ఓం సాయి సుఖ మల్లేష్, ఇప్ప స్వామి, షేక్ గౌస్‌బాబా, గాండ్ల మహేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లిలో సీపీఐ ప్రజా చైతన్య పోరు యాత్ర

బెల్లంపల్లి, ఆగస్టు 12, ప్రభాతవార్త



భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి పిలుపు మేరకు ఆగస్టు 6 నుంచి 14 వరకు నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్రలో భాగంగా బుధవారం బెల్లంపల్లి పట్టణంలో పోరు యాత్ర నిర్వహించారు. పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమోళి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత భగత్‌సింగ్ విగ్రహానికి, అమరజీవి మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి మిట్టపల్లి వెంకటస్వామి, బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యపరిచేందుకే దేశవ్యాప్తంగా సీపీఐ ప్రజా చైతన్య యాత్రలు నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వ విద్య, వైద్య రంగాలను బలోపేతం చేయాలని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, ధరల పెరుగుదలను అరికట్టాలని డిమాండ్ చేశారు. రైతుల పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, దళితులు, ఆదివాసీలపై దాడులు, ఆకృత్యాలను అరికట్టాలని కోరారు. మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని, కార్మిక హక్కులను పరిరక్షించాలని, బ్యాలెట్ పేపర్ విధానంలో ఎన్నికలను పునరుద్ధరించి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. బెల్లంపల్లి పట్టణంలో రోడ్డు విస్తరణ కారణంగా ఉపాధి కోల్పోయిన చిరు వ్యాపారులకు వెంటనే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరారు. పట్టణం చుట్టూ ఉన్న ప్రభుత్వ, ఖాళీ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసి అక్రమంగా ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై అధికారులు తక్షణమే స్పందించి అక్రమాలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రజలకు క్రమం తప్పకుండా మంచినీటి సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు బొల్లం పూర్ణిమ, జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య, బీకేఎంయూ జాతీయ సమితి సభ్యులు అక్కెపల్లి బాబు, బెల్లంపల్లి మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, తాండూర్ మండల కార్యదర్శి కొల్లు బానేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జాడి పోషం, బీకేఎంయూ జిల్లా కార్యదర్శి గుండా చంద్రమాణిక్యం, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బొల్లం సోని, జిల్లా సమితి సభ్యులు డీఆర్ శ్రీధర్, బొల్లం తిలకంబెడ్కర్, రత్నం రాజం, మేకల రాజేశం, మంతెన రమేష్, ఎఫ్ఐటీ కార్యదర్శులు రత్నం ప్రవీణ్‌కుమార్, వడ్డె మల్ల రాజేందర్, లక్ష్మీనారాయణ, జిల్లా ప్రజానాట్యమండలి ఉపాధ్యక్షులు బొంకూర్ రామచందర్, నాయకులు జూపాక కొమురయ్య, బండారు శంకర్, అందుగుల రాజేందర్, స్వామిదాసు, కే. తిరుపతి, చంద్రయ్య, నర్సింగ్, గుండా శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## బలన్‌పూర్ పాఠశాల నిర్లక్ష్యానికి నిలువుటద్దం

### ఒక్కరే ఉపాధ్యాయుడు.. నలుగురే విద్యార్థులు

బజార్‌హత్నూర్, ఆగస్టు 12, ప్రభాతవార్త:

మండలంలోని బలన్‌పూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అధికారుల, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపించి తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. ఈ పాఠశాలలో కేవలం ఒక్కరే ఉపాధ్యాయుడు విధులు నిర్వర్తిస్తుండగా, ప్రస్తుతం నలుగురు విద్యార్థులు మాత్రమే చదువుకుంటున్నారు. సరైన మౌలిక వసతులు లేకపోవడం వల్లే బడిలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్యార్థుల కోసం నిర్మించిన మరుగుదొడ్లు వాడకానికి నోచుకోక వృథాగా మారగా, మధ్యాహ్న భోజనం వండేందుకు చేపట్టిన వంట గది నిర్మాణం అసంపూర్తిగానే నిలిచిపోయింది. పాఠశాల ఆవరణలోని వాష్ బేసిన్లకు నీటి సరఫరా లేకపోవడంతో విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రాంగణమంతా పిచ్చి మొక్కలు, పొదలతో నిండి అపరిశుభ్రంగా తయారైంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని, అదనపు ఉపాధ్యాయులను నియమించి పాఠశాలను బలోపేతం చేయాలని గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



## దారి ఇలా.. నడిచేదెలా..?

- రోడ్డుపై మురుగు నీరు.. అడుగేస్తే అవస్థే
- పారిశుధ్యం లోపించడంతో వెదజల్లుతున్న దుర్గంధం

చెన్నూరు, ఆగస్టు 12, ప్రభాతవార్త

డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో గ్రామంలోని పలు వీధుల్లో మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం ఆస్నాద్ గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగునీరు రోడ్లపై ప్రవహించడంతో నడిచేందుకు కూడా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలం మొదలైనప్పటి నుంచి ఈ సమస్య మరింత ఎక్కువ అయిందని అంటున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు పెరిగి అనారోగ్య సమస్యలు వస్తున్నాయని అంటున్నారు. వెంటనే డ్రైనేజీ కాలువలు శుభ్రం చేసి, మురుగు నీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

## గోమాతను జాతీయమాతగా ప్రకటించాలి

### డిసెంబరు పదిహేడువరకు సంతకాల సేకరణ: భవాని సతీష్ పిలుపు

మంచిర్యాల, ఆగస్టు 12, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో జిల్లా ప్రభారీ వేముల హరిప్రసాద్ అధ్యక్షతన గో సమ్మాన్ ఆహ్వాన్ అభియాన్‌పై సమావేశం నిర్వహించారు. గో హత్యను నిర్మూలించి, గోమాతను జాతీయమాతగా ప్రకటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ డిసెంబరు పదిహేడువరకు మూడో దఫా సంతకాల సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భవాని సతీష్ మాట్లాడుతూ సనాతన ధర్మంలో గోమాతకు విశిష్ట స్థానం ఉందని, గోమాతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. దేశవ్యాప్తంగా నలభై కోట్ల సంతకాలు సేకరించి, గోమాతను జాతీయమాతగా ప్రకటించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గోనె శ్యామ్‌సుందర్‌రావు, దొంతుల ముకేశ్, కర్ణకంటి రవీందర్, పురుషోత్తం జాజ్, కార్యదర్శి వేముల రమేష్, జిల్లా ఉపాధ్యక్షురాలు కనకతార, రామగిరి శ్రీనివాస్, అమిత్‌కృష్ణ, మణికంఠ, తోట కార్తీక్, ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.





## విద్యార్థి సమస్యలపై పోరాటం కొనసాగించాలి

### - బీఆర్ఎస్‌వీ నాయకులకు రాష్ట్ర అధ్యక్షుడు గిల్లు శ్రీనివాస్ సూచన

నిర్మల్, ఆగస్టు 12, ప్రభాతవార్త:

ఆదిలాబాద్ జిల్లా పర్యటన ముగించుకుని హైదరాబాద్ వెళ్తున్న బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గిల్లు శ్రీనివాస్ యాదవ్‌ను బుధవారం నిర్మల్‌లో బీఆర్ఎస్‌వీ జిల్లా ఉపాధ్యక్షుడు మీర్జా షోయిబ్ బేగ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం కార్యకలాపాలు, జిల్లాలోని విద్యార్థుల సమస్యలపై ఇరువురూ చర్చించారు. గిల్లు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల పరిరక్షణకు నిరంతరం పోరాటం చేయాలని సూచించారు. విద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టళ్ల సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా కార్యాచరణ రూపొందించాలని పిలుపునిచ్చారు. జిల్లా నాయకత్వ చురుకుదనాన్ని అభినందిస్తూ, భవిష్యత్తులో సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ నిర్మల్ జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బోనాల వేడుకల్లో బోనమెత్తిన ఎమ్మెల్యే

బెల్లంపల్లి, ఆగస్టు 12, ప్రభాతవార్త



ఆషాఢ మాస బోనాల పర్వదినాన్ని పురస్కరించుకుని బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రడగంబాల బస్తీలో బోనాల వేడుకలు వైభవంగా నిర్వహించారు. స్థానిక వార్డు కౌన్సిలర్ దామెర విజయ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి బోనం సమర్పించారు. నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని, రైతులకు పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరిపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ రత్నం సుకుమారి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్, కౌన్సిలర్ కంకటి ప్రణీత శ్రీనివాస్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బస్తీ మహిళలు, భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ బోనాల వేడుకల సందర్భంగా బస్తీలో భక్తిశ్రద్ధలు వెల్లివిరిశాయి. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

# విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల బ్యూరో, ఆగస్టు 12, ప్రభాతవార్త**

ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, మూత్రశాలలు, వసతి, వంటశాల, సామాగ్రి నిల్వ గది, పరిసరాలతో పాటు కొనసాగుతున్న మరమ్మత్తు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సకల సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని తెలిపారు. పాఠశాలలో కొనసాగుతున్న మరమ్మత్తు పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. అనంతరం చెన్నూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పూర్తి కాబడిన భోజనశాలను పరిశీలించి విద్యార్థుల సౌకర్యార్థం వినియోగించాలని, అదనపు గదుల పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మధ్యాహ్న భోజనం తయారీలో శుభ్రత నిబంధనలు పాటించాలని, తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులను వినియోగించాలని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి వంటశాల, మూత్రశాలలు, కొనసాగుతున్న అదనపు గదుల పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం అయినందున పరిసరాల పరిశుభ్రత పై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## గంగగౌడ్ కుటుంబానికి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి భరోసా

**బెల్లంపల్లి, ఆగస్టు 12, ప్రభాతవార్త**

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పోడేటి గంగ గౌడ్ కుటుంబాన్ని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పరామర్శించారు. కాసిపేట మండలం కొండాపూర్ (యాప) గ్రామంలోని గంగ గౌడ్ స్వగృహానికి వెళ్లిన ఎమ్మెల్యే గడ్డం వినోద్ వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు తమకు ఆరుగురు ఆడపిల్లలు ఉన్నారని, నివాసానికి సొంత ఇల్లు కూడా లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వారి పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి, కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. అనంతరం కుటుంబానికి ఆర్థిక సాయం అందించి, గంగ గౌడ్ మృతికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సిఎస్ఐ రైడల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమం

**లక్షెట్టిపేట, ఆగస్టు 12, ప్రభాతవార్త**


మున్సిపాలిటీ పరిధిలోని సీఎస్ఐ రైడల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్లాంటేషన్ డ్రైవ్ లో భాగంగా డిప్యూటీ ఎఫ్ఆర్ఓ సాగరిక, ఆరో వార్డు కౌన్సిలర్ తోట సువర్ణ రమేష్ చేతుల మీదుగా మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మొక్కలు నాటడం అనేది మన పర్యావరణాన్ని రక్షించడానికి, భూమిని పచ్చదనంతో నింపడానికి చేసే అత్యంత ముఖ్యమైన కార్యక్రమం అని అన్నారు. పర్యావరణ సమతుల్యత కోసం ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి అన్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు కలిసి ఈ చెట్లు నాటడం అనే పండుగను జరుపుకుంటారు. ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన కలిగి ఉండాలని భవిష్యత్ తరాలకు ప్రాణ వాయువైన ఆక్సిజన్ ను సంపూర్తిగా అందించాలంటే మొక్కలు పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎస్. డేవిడ్ పాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి తరలింపు ఆరోపణలు అవాస్తవం

**- అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపితే నిజాలు తెలుస్తాయి**

**తాండూర్, ఆగస్టు 12, ప్రభాతవార్త**

తాండూర్ మండలంలోని అంకపల్లి గ్రామ శివారులో తమ పట్టా భూమిలో నుండి మట్టి తరలించారని లింగదరి గూడెం కు చెందిన దుర్గం ఉషారాణి విజయ శంకర్ దంపతులు చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని షేక్ మోహినుద్దీన్ (మున్ని ) తెలిపారు. తాండూర్ ప్రెస్ క్లబ్ లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని దశాబ్దాలుగా తన పట్టా భూమి పక్కన కాలువ ఉందని, ఆ కాలువ ఇప్పుడు పూడికతో నిండిపోయిందన్నారు. తాను, తన చేను పక్కన ఉన్న రైతులు ఆ పూడిక మట్టి తీసి కట్టగా పోశామన్నారు. ఎవరి భూమిలో మట్టిని తాము తరలించలేదని, ఎవరి భూమిని తాము పాడు చేయలేదని పేర్కొన్నారు. ఉషారాణి విజయ్ శంకర్ దంపతులే కాలువ భూమిని కబ్జా చేసి తనపై ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సంబంధిత అధికారులు మోకా పైకి వచ్చి పూర్తిస్థాయి విచారణ చేస్తే నిజా నిజాలు తెలుస్తాయని ఆయన సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసి నిజాలు నిగ్గు తేల్చాలని, కాల్వ భూమి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మోహినుద్దీన్

## చిన్న పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

**- ఎస్సై శ్రీకాంత్**

**కెరమెరి, ఆగస్టు 12, ప్రభాతవార్త:**

చిన్నపిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. పల్లె గ్రామంలో సమీప వాగుల్లో బట్టలు ఉతికే సమయంలో చిన్నపిల్లల్ని తల్లిదండ్రులు తీసుకువెళ్ళద్దని సూచించారు పిల్లలు ఆడుకుంటూ తెలియకుండానే నీళ్లలో దిగే అవకాశం ఉంటాయని అందువల్ల పిల్లలు విషయంలో జాగ్రత్త వహించాలని సూచించారు బుధవారం మండలంలోని ధనోరా గ్రామపంచాయతీ గోండుగూడ గ్రామానికి చెందిన ఆత్రం లక్కీ నాలుగు సంవత్సరాలు వయస్సు చిన్న పాప గ్రామం పక్కనే గల ధనోర వాగులో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు మునిగిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసిఫాబాద్ ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు చనిపోయిందని నిర్ధారించినారు. తండ్రి ఆత్రం జాకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

## నిర్మల్ జిల్లాలో వర్షపాతం సాధారణం

**- పెంబి, కడ్డంపెద్దూర్, నిర్మల్ పట్టణంలో అధిక వర్షం**

**నిర్మల్, ఆగస్టు 12, ప్రభాతవార్త:**

జూన్ 1 నుంచి ఆగస్టు 12 వరకు నిర్మల్ జిల్లాలో కురిసిన వర్షపాతం సాధారణంగా నమోదైంది. జిల్లా సగటు వాస్తవ వర్షపాతం 574.6 మి.మీ. కాగా, సాధారణ వర్షపాతం 584.4 మి.మీ. నమోదు కావాల్సి ఉంది. కేవలం 1.7 శాతం కొరత ఉండటంతో జిల్లా "సాధారణ" కేటగిరీలో ఉంది. వాతావరణ శాఖ నివేదిక ప్రకారం బుధవారం జిల్లాలో సగటున 1.2 మి.మీ. వర్షం కురిసింది. అత్యధికంగా పెంబి మండలంలో 6.1 మి.మీ., నిర్మల్ పట్టణంలో 2.5 మి.మీ., కడ్డంపెద్దూర్‌లో 2.2 మి.మీ., దిలావర్‌పూర్, నర్సాపూర్ (జి)లలో 2.1 మి.మీ. వర్షం పడింది. కుబీర్, తనూర్, బాసర, భైంసా, సారంగాపూర్ మండలాల్లో ఈరోజు వర్షం నమోదు కాలేదు. జూన్ 1 నుంచి ఇప్పటివరకు నమోదైన గణాంకాల ప్రకారం జిల్లాలోని 19 మండలాల్లో పెంబి (32 ), కడ్డంపెద్దూర్ (27 ), నిర్మల్ పట్టణం (21 ) "అధిక" వర్షపాతం నమోదు చేశాయి. మామడ, దస్తూరాబాద్, ఖానాపూర్, సోన్ మండలాలు సాధారణం కంటే కొంత మేర ఎక్కువ వర్షపాతంతో "సాధారణ" జాబితాలో ఉన్నాయి. మరోవైపు కుబీర్ (26 కొరత), తనూర్ (32 కొరత) మండలాలు "కొరత" కేటగిరీలో ఉన్నాయి. బాసర, ముధోల్, భైంసా, కుంటాల, నర్సాపూర్ (జి), లోకేశ్వరం, దిలావర్‌పూర్, సారంగాపూర్, నిర్మల్ రూరల్, లక్ష్మణచందా మండలాల్లో వర్షపాతం సాధారణంగా నమోదైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ పంటలకు మేలు చేస్తాయని వ్యవసాయాధికారులు తెలిపారు.

## బెల్లంపల్లిలో యుసిజి పైలట్ బోర్‌హోల్ స్థల పరిశీలన

**బెల్లంపల్లి, ఆగస్టు 12, ప్రభాతవార్త**



సింగరేణి సంస్థ మందమర్రి ఏరియాలోని బెల్లంపల్లి ప్రాంతంలో చేపడుతున్న అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్ (యుసిజి) అన్వేషణ కార్యక్రమంలో భాగంగా బుధవారం రోజున బుధ గెస్ట్‌హౌస్ సమీపంలో ప్రతిపాదించిన పైలట్ బోర్‌హోల్ స్థలాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ఆదేశాల మేరకు డ్రిల్లింగ్ పనులు ప్రారంభించేందుకు స్థల అనుకూలత, భౌగోళిక పరిస్థితులు, క్షేత్రస్థాయి ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. డ్రిల్లింగ్ పనులకు అవసరమైన ఏర్పాట్లపై చర్చించి, ప్రాథమిక పరిశీలనను పూర్తి చేశారు. ఈ సందర్భంగా డ్రిల్లింగ్ పనులు సజావుగా ప్రారంభించేందుకు అవసరమైన సాంకేతిక, క్షేత్రస్థాయి ఏర్పాట్లను సమీక్షించారు. పనుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, స్థల అనుకూలత తదితర అంశాలపై అధికారులు చర్చించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఏజెంట్ ఏజిఎం సంతోష్ కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ (జియాలజీ) ఎం. రమేష్ బాబు, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎ.ఎస్.ఓ. దేశాయ్, డిప్యూటీ ఎస్ఈ శివ శంకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# సర్వసభ్య సమావేశంలో సమస్యల వెల్లువ

**బెజ్జూర్, ఆగస్టు 12, ప్రభాతవార్త:**



బెజ్జూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ బిఎస్ ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు వారి పనితీరు నివేదికలను వివరించారు. అలాగే వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు వారి గ్రామపంచాయతీలలో గల సమస్యలను తెలియజేశారు. ఇటి సమావేశానికి ఎంఎల్ఏ పాల్వాయి హరీష్ బాబు, ఎంఎల్సి దండే విఠల్ పాల్గొని ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్క లబ్ధిదారునికి అందే విధంగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. కుకుడ గ్రామంలోని పాఠశాల భవనం అసంపూర్తిగా ఉన్నందున విద్యార్థులు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ తొర్రెం చిరంజీవి తెలిపారు. తమ గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న రెండు ఒర్రెలపై హై లెవెల్ వంతెనలు కావాలని సోమిని సర్పంచ్ తెలిపారు. మూగ వెల్లి గ్రామంలో లో వోల్టేజీ విద్యుత్ సమస్య అధికంగా ఉందని సర్పంచ్ కొడిపె శంకర్ తెలిపారు. అంతేకాకుండా పలు గ్రామపంచాయతీల్లో విబి గ్రామ్ జి పథకంలో మౌలిక సదుపాయాల కొరకు నిర్వహించిన పనులకు బిల్లులు ఇప్పటివరకు పెండింగ్లో ఉన్నాయని కొందరు సర్పంచులు తెలియజేశారు. ఉద్యానవన శాఖ అధికారి తన నివేదికను వినిపించే సందర్భంలో ఇప్పటివరకు ఆ అధికారి ఎవరో కూడా తమకు తెలియదని అనేకమంది సర్పంచులు తెలిపారు. సమస్యలన్నిటినీ విని వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆయా శాఖల అధికారులను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఆదేశించారు. బెజ్జూర్ సామాజిక ఆసుపత్రి నూతన భవన నిర్మాణం కోసం పెట్టిన ప్రతిపాదన తుది దశకు చేరిందని ఆర్థిక శాఖ క్లియరెన్స్ రాగానే పనులు మొదలు పెడతామని ఎంఎల్ఏ తెలిపారు. అలాగే సులుగుపల్లి వద్ద నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించాల్సిందిగా తహసిల్దార్ను ఆదేశించారు. సోమిని గ్రామంలో మరొక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయిస్తామని అన్నారు. డాక్టర్లు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని, నార్మల్ డెలివరీ కేసులను ఆసుపత్రిలోనే నిర్వహించాలని ఆదేశించారు. బెజ్జూర్, సోమిని గ్రామాల మధ్య ఉన్న వంతెనల నిర్మాణం కోసం అటవీ శాఖ మంత్రితో సమావేశం అవుతానని, ఎక్కడా లో వోల్టేజ్ విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేశారు. ఇట్టి సమావేశంలో తహసిల్దార్ రామ్మోహన్రావు ప్రత్యేక అధికారి నదీమ్, డిఆర్ఓ శ్రావణ్ కుమార్, ఎంఏఓ నాగరాజు, ఎంఈఓ సునీత, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## ఆగస్టు 14న ఆసిఫాబాద్‌లో హర్ ఘర్ తిరంగా యాత్ర

**ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 12, ప్రభాతవార్త :**

హర్ ఘర్ తిరంగా యాత్రలో భాగంగా ఈ నెల 14న ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో తిరంగా యాత్ర నిర్వహించనున్నట్లు హర్ ఘర్ తిరంగా యాత్ర జిల్లా కన్వీనర్ ఖాండ్రే విశాల్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని స్థానిక సరస్వతి శిశుమందిర్ లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. హర్ ఘర్ తిరంగా యాత్ర శుక్రవారం ఉదయం 9.30 గంటలకు అంబేద్కర్ చౌక్ నుంచి ప్రారంభమై గాంధీ చౌక్, వివేకానంద చౌక్ మీదుగా తిరిగి అంబేద్కర్ చౌక్ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ముఖ్య అతిథిగా హాజరుకానుండగా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం ధోని, రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో త్రివర్ణ పతాకాలతో పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు శ్రీనివాస్, కోటేశ్వరావు, గణేష్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నిండు గర్భిణీ ప్రాణాలు కాపాడిన యువకులు

**కెరమెరి, ఆగస్టు 12, ప్రభాతవార్త :**



కెరమెరి మండలం తుమ్మగూడ గ్రామపంచాయతీ కొలంగూడ గ్రామానికి చెందిన కోడప రామేశ్వరి భర్త పేరు భీమ్రావు. ఏడు నెలల గర్భవతి. కడుపులో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఎత్తుకొని ఉధృతంగా ప్రవహిస్తున్న గొరియాగూడ వాగును దాటించి కేరమేరీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ పరీక్షించిన వైద్యులు కడుపులో పిండం కదలికలు లేకపోవడంతో ఆసిఫాబాద్ ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు. ప్రస్తుతం అసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీ చికిత్స పొందుతోంది.

## మృతుడి కుటుంబానికి మున్నూరు కాపు సంఘం అండ

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 12, ప్రభాతవార్త :**



ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు మున్నూరు కాపు సంఘం నాయకులు. దహేగాం మండలం కొత్తమీర్ గ్రామానికి చెందిన మున్నూరు కాపు కులస్తుడు సిద్ధం లస్మయ్య అనారోగ్యంతో బాధపడుతూ 15 రోజుల క్రితం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆసిఫాబాద్ జిల్లా మున్నూరు కాపు సంఘం పటేల్స్ జిల్లా అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్ బుధవారం లస్మయ్య కుటుంబాన్ని పరామర్శించారు. లస్మయ్య మృతితో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిన నేపథ్యంలో ఆయన భార్యను ఓదార్చి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంబానికి చేయూతగా 50 కిలోల బియ్యం బస్తాను అందజేశారు. ఈ సందర్భంగా ఆపదలో ఉన్న మున్నూరు కాపు కుటుంబాలకు సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని గజ్జల లక్ష్మణ్ తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ తాలూకా వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లి తిరుపతి పటేల్, పార్వతి సురేష్, సాయిదామ్ అశోక్, బొడ్డు జలపాతి, అల్లి బాబాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచుల మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**సిర్పూర్(టి), ఆగస్టు 12, ప్రభాతవార్త :**



ఉప సర్పంచులు, వార్డు సభ్యుల ఫోరం మండల కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యుల రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్, జిల్లా అధ్యక్షుడు దీపక్ ముండే ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు దీపక్ తెలిపారు. మండల అధ్యక్షుడిగా దుర్గం ప్రశాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గాడి శేఖర్, ఉపాధ్యక్షురాలిగా కొండగుర్ల శారద, ప్రధాన కార్యదర్శిగా దంద్రీ దివాకర్, కోశాధికారిగా కేడెం సతీష్, అధికార ప్రతినిధిగా గాజిరెడ్డి మోహన్, కార్యనిర్వాహక సభ్యుడిగా లోకండే వసంతరావు, అలాగే కార్యనిర్వాహక సభ్యుడిగా మొగిలి శివప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు నాయకులు అభినందనలు తెలిపారు. ఉప సర్పంచులు, వార్డు సభ్యుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయాలని సూచించారు. స్థానిక సంస్థల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు బాధ్యతాయుతంగా పనిచేయాలని పేర్కొన్నారు.

## ఇన్‌స్పైర్ మనక్ అవార్డుకు విద్యార్థిని చంద్రకళ ఎంపిక

**తాండూర్, ఆగస్టు 12, ప్రభాతవార్త :**



మండలంలోని మాదారం 3 ఇంక్లైన్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థినిచింతపూరి చంద్రకళ ఇన్ స్పైర్ మనక్ అవార్డుకుఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాగర్ తెలిపారు. 2025 26 విద్యా సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మక ఇన్ స్పైర్ మనక్ అవార్డుకు ఎంపిక కావడం పట్ల ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. శాస్త్ర సాంకేతిక రంగాలపై ఆసక్తి చూపి పాఠశాలకు మంచి పేరు తెచ్చిన విద్యార్థిని చంద్రకళను గ్రామ సర్పంచ్ చందనాల రవి కుమార్, ఉప సర్పంచ్ చింతపూరి మల్లేశ్వరి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.



## విద్యార్థులకు షూస్ పంపిణీ

**తాండూర్, ఆగస్టు 12, ప్రభాతవార్త :**

మండలంలోని మాదారం3 ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం ఉచిత షూస్ పంపిణీ చేశారు. సర్పంచ్ చందనాల రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే ఉచితంగా పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు అందిస్తుండగా, ఈ విద్యా సంవత్సరం నుండి షూస్ కూడా పంపిణీ చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన, మౌలిక వసతులు కల్పించడం జరుగుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చింతపూరి మల్లేశ్వరిప్రధానోపాధ్యాయులు సాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి సైన్స్ డ్రామా ఫెస్టివల్‌కు విద్యార్థులు సిద్ధం

**ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 12, ప్రభాతవార్త**

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానం, సృజనాత్మకతను పెంపొందించే లక్ష్యంతో ఆగస్టు 29న కాగజ్‌నగర్‌లో జిల్లా స్థాయి సైన్స్ డ్రామా ఫెస్టివల్-2026 నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సచ్చిదానంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్ అండ్ సొసైటీ ప్రధాన అంశంగా జరిగే పోటీల్లో కృత్రిమ మేధస్సు, ఎలక్ట్రిక్ వాహనాలు, అంతరిక్ష నివాసాలు, సముద్రాల పునరుద్ధరణ అంశాలపై విద్యార్థులు డ్రామాలు ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చని, ఒక్కో బృందంలో గరిష్ఠంగా 10 మంది ఉండాలని తెలిపారు. ఆగస్టు 20లోగా పాఠశాలలు రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని సూచించారు. పోటీ వివరాల కోసం జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్‌ను 9441140434లో సంప్రదించాలని తెలిపారు. ప్రథమ బహుమతి సాధించిన బృందం రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తుందని పేర్కొన్నారు.

## నీరు రాక అవస్థలు...

**దహెగాం, ఆగస్టు 12, ప్రభాతవార్త :**

దహెగాం మండలంలోని పెసరికుంట గ్రామపంచాయతీ పరిధిలోని మురళీగూడ గ్రామంలో మోటర్ చెడిపోయి గ్రామానికి మొత్తం నీరు రాకపోవడంతో వెంటనే స్పందించి సర్పంచ్ అ గ్రామానికి వెళ్లాలంటే ఒర్రె దాటాలి వర్షం రావడంతో ఒర్రె నీరు ఎక్కువ పారుతుంది అయిన ఒర్రె దాటి మోటర్ బిగించేసి అ గ్రామానికి నీరు అందేలా చేశారు. సర్పంచ్ కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.



# జిల్లా స్థాయి సైన్స్ డ్రామా ఫెస్టివల్‌కు విద్యార్థులు సిద్ధం కావాలి

### - 20లోగా నమోదు.. 29న జిల్లా స్థాయి పోటీలు - జిల్లా విద్యాశాఖాధికారి సచ్చిదానంద

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 12, ప్రభాతవార్త :**

కుమురం భీం ఆసిఫాబాద్, ఆగస్టు 12: విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానం, సృజనాత్మకత, శాస్త్రీయ అవగాహనను పెంపొందించడంతో పాటు విజ్ఞానశాస్త్రాన్ని సమాజంతో అనుసంధానం చేయాలనే ఉద్దేశంతో జిల్లా స్థాయి సైన్స్ డ్రామా ఫెస్టివల్ 2026 నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సచ్చిదానంద్ తెలిపారు. రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి మార్గదర్శకాల మేరకు ఆగస్టు 29న కాగజ్‌నగర్‌లోని డివిజనల్ డిస్ట్రిక్ట్ సైన్స్ సెంటర్, ఎంపీపీఎస్ సరిసిల్క్ వేదికగా జిల్లా స్థాయి సైన్స్ డ్రామా ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది సైన్స్ అండ్ సొసైటీ–విజ్ఞానశాస్త్రం సమాజం ప్రధాన అంశంగా నిర్ణయించినట్లు తెలిపారు. విద్యార్థులు కింది నాలుగు ఉప అంశాల్లో ఏదో ఒకదాన్ని ఎంచుకుని విజ్ఞానశాస్త్ర నాటకాన్ని రూపొందించి ప్రదర్శించాల్సి ఉంటుంది... కృత్రిమ మేధస్సు: మిత్రమా? సాధనమా? ముప్పా?.. విద్యుత్ వాహనాలు: భవిష్యత్తు మార్గం.. అంతర్ నక్షత్ర నివాసాలు / అంతరిక్ష నివాసాలు.. సముద్రాల పునరుద్ధరణ–భవిష్యత్ తరాల పరిరక్ష10 మందితో బృందం 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఒక్కో బృందంలో గరిష్ఠంగా 10 మంది ఉండవచ్చని, ఒక దర్శకుడు, ఒక నాటక రచయితతో పాటు గరిష్ఠంగా ఎనిమిది మంది రంగస్థల కళాకారులు ఉండాలని సూచించారు. నాటక ప్రదర్శన 30 నిమిషాలకు మించకూడదని స్పష్టం చేశారు.100 మార్కులకు మూల్యాంకనంపోటీల్లో ప్రదర్శనను మొత్తం 100 మార్కులకు మూల్యాంకనం చేయనున్నారు. ఇందులో నాటక ప్రదర్శనకు 50 మార్కులు, శాస్త్రీయ అంశానికి 30 మార్కులు, నాటక ప్రభావానికి 20 మార్కులు కేటాయించారు.20లోగా నమోదుజిల్లాలోని ఆసక్తి ఉన్న పాఠశాలలు ఆగస్టు 20, 2026లోగా నిర్దేశించిన గూగుల్ ఫారం ద్వారా నమోదు పూర్తి చేయాలని డీఈవో సచ్చిదానంద్ సూచించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించి అధిక సంఖ్యలో సైన్స్ డ్రామా పోటీల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కోరారు.పోటీలకు సంబంధించిన పూర్తి వివరాలు, నియమ నిబంధనలు, నమోదు తదితర సమాచారం కోసం జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్‌ను 9441140434 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి సాధించే బృందానికి రాష్ట్ర స్థాయి సైన్స్ డ్రామా పోటీలో పాల్గొనే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి మార్గదర్శకాల ప్రకారం జిల్లా స్థాయి పోటీలను సెప్టెంబరు 3, 2026లోగా పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు.



## ద్వారకాపూర్ పంచాయితీలో గ్రామసభ

**తాండూర్, ఆగస్టు 12, ప్రభాతవార్త :**

తాండూర్ మండలంలోని ద్వారకాపూర్ గ్రామ పంచాయతీలో బుధవారం సర్పంచ్ మాసాడి తిరుపతి అధ్యక్షతన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో పంచాయతీ పరిధిలో పచ్చదనం పరిశుభ్రత, మంచినీటి సరఫరా, నర్సరీ నిర్వహణ వంటి వివిధ అభివృద్ధి పనులు, పథకాలు, ప్రణాళికలపై చర్చించారు. పలు అభివృద్ధి పనుల కోసం ఏకగ్రీవ తీర్మానం చేశారు. గ్రామసభలో వార్డు మెంబర్ పులి శెట్టి సత్తయ్య, అన్నం చంద్రమ్మ, అంగన్వాడీ టీచర్ రాజేశ్వరి అమృత, ఆశా కార్యకర్త లక్షి ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట... బెల్లంపల్లి, తాండూర్‌లో 70 ఎకరాల్లో అర్బన్ పార్కులు

### - అటవీ శాఖ అధికారులతో ఎమ్మెల్యే గడ్డం వినోద్ చర్చలు

**బెల్లంపల్లి, ఆగస్టు 12, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి, తాండూర్ ప్రాంతాల్లో సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో అర్బన్ పార్కులు ఏర్పాటు చేసేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు అటవీ శాఖ అధికారులు బుధవారం రోజున బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి పార్కుల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను వివరించారు. డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, ఎఫ్‌డీవో విజయ్, ఎఫ్ఆర్ఓ పూర్ణచందర్‌లు ఎమ్మెల్యేతో సమావేశమై ప్రతిపాదిత పార్కుల కోసం స్థలాలు, అభివృద్ధి చేయాల్సిన విధానం, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించారు. పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం పెంచడంతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా ఈ అర్బన్ పార్కులను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అర్బన్ పార్కుల ఏర్పాటుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. పార్కులు అందుబాటులోకి వస్తే ప్రజలకు వాకింగ్ ట్రాక్‌లు, పచ్చదనం, విశ్రాంతి ప్రదేశాలు వంటి సౌకర్యాలు లభించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడనున్నాయి.

## కుమ్మరులకు ఆసరా పింఛన్లలో తొలి ప్రాధాన్యత ఇవ్వాలి

### - జిల్లా కలెక్టర్, బీసీ సంక్షేమ అధికారికి కుమ్మరి సంఘం వినతి

**మంచిర్యాల, ఆగస్టు 12 ,ప్రభాతవార్త**



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం అందించనున్న ఆసరా పింఛన్లలో అర్హులైన కుమ్మరి కులస్తులకు తొలి ప్రాధాన్యత కల్పించాలని తెలంగాణ కుమ్మరి సంఘం మంచిర్యాల జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ (పరిపాలన అధికారి), బీసీ సంక్షేమ అధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుమ్మరి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, కుటుంబ సభ్యులందరూ కలిసి శ్రమిస్తేనే వృత్తి కొనసాగించే పరిస్థితి ఉందని తెలిపారు. ముఖ్యంగా సారె తిప్పే వృత్తిలో నిరంతరం శ్రమించడం వల్ల నడుములు వంగిపోయి అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి కుమ్మరికి ఆసరా పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రమేష్, కార్యనిర్వాహక అధ్యక్షులు సలిగంటి రమేష్, ప్రధాన కార్యదర్శి నాగపురి రాజేంద్రప్రసాద్, కోశాధికారి సిరికొండ సతీష్, గౌరవ అధ్యక్షులు ఇజ్జగిరి రామస్వామితో పాటు జిల్లా అధికార ప్రతినిధులు ఇజ్జగిరి శంకర్, అగుడ తిరుపతి, ఇజ్జగిరి కరుణాకర్, సిరికొండ నరేష్, కొత్తపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు ఉద్యోగాలపై యువతకు ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్

**ఆసిఫాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త :**

తెలంగాణ ప్రభుత్వం పోలీసు, ఎస్‌పీఎఫ్, జైళ్ల శాఖ తదితర విభాగాల్లో 7,437 ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో యువతకు ఉచిత రెసిడెన్షియల్ పోలీసు రిక్రూట్‌మెంట్ కోచింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సివిల్ కానిస్టేబుల్ 87, ఏఆర్ కానిస్టేబుల్ 40, ఫైర్‌ఫైటర్స్ 9, జైల్ వార్డర్ 3 కలిపి మొత్తం 139 పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి ఉచిత వసతి, తరగతి బోధన, శారీరక శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. ఆగస్టు 15న ప్రవేశ పరీక్ష నిర్వహించి, అందులో ఎంపికైన అభ్యర్థులకు కోచింగ్ అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న యువత తమ సమీప పోలీస్‌స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని, ముఖ్యంగా పేద, గ్రామీణ, గిరిజన, మారుమూల ప్రాంతాల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ తెలిపారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేస్తూ దేశభక్తిని చాటాలి

### - వార్డు కౌన్సిలర్ గజ్జల లావణ్య

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 12, ప్రభాతవార్త :**



దేశభక్తి భావనను పెంపొందించడంతో పాటు జాతీయ జెండాపై ప్రతి ఒక్కరిలో గౌరవభావాన్ని మరింతగా పెంచే ఉద్దేశంతో నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా కాగజ్‌నగర్ పట్టణంలోని 8వ వార్డులో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్‌బాబు ఆదేశాల మేరకు 8వ వార్డు కౌన్సిలర్ గజ్జల లావణ్య లక్ష్మణ్ నివాసంపై జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా జాతీయ జెండా ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేస్తూ దేశభక్తిని చాటాలని, జాతీయ జెండాను గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యతగా భావించాలని సూచించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా దేశ సమైక్యత, ఐక్యతా భావం, దేశభక్తి మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.ప్రజలు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో భాగస్వాములై జాతీయ జెండాను గౌరవప్రదంగా ఎగురవేసి దేశభక్తి భావాన్ని చాటాలని పిలుపునిచ్చారు. జాతీయ జెండా ప్రతి భారతీయుడి గర్వానికి ప్రతీక అని పేర్కొంటూ, జెండా గౌరవానికి భంగం కలగకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## రేషన్‌డీలర్‌పై చర్యలు తీసుకోండి

**తాండూర్, ఆగస్టు 12, ప్రభాతవార్త :**



మండలంలోని తంగళ్ళపల్లి గ్రామంలోని రేషన్ షాపు నెంబర్ 6 డీలర్ పై చర్యలు తీసుకోవాలని లబ్ధిదారుడు గుడిగంటి విజయ్ కోరారు. ఈ మేరకు బుధవారం తహసిల్దార్ జ్యోత్స్నకు లబ్ధిదారుడు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు మాట్లాడుతూ బియ్యం తీసుకోవడానికి రేషన్ షాపుకు వెళితే బియ్యం ఇవ్వకుండా రేపు, మాకు అంటూ నాలుగు రోజులు నుండి తిప్పించుకుంటున్నాడన్నారు. రేషన్ బియ్యం తీసుకోకుండా తనకే అమ్మాలని ఒత్తిడి చేస్తున్నడన్నారు. సంబంధిత అధికారులు వెంటనే విచారణ జరిపి రేషన్ డీలర్ పై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు: దండ రామకృష్ణారెడ్డి

### - మదర్స్ ప్రైడ్ స్కూల్‌లో వైభవంగా పోశమ్మ బోనాల ఉత్సవాలు

**నస్పూర్, ఆగస్టు 12, ప్రభాతవార్త**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని మదర్స్ ప్రైడ్ స్కూల్ ప్రిన్సిపాల్ దండ రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. నస్పూర్ పట్టణంలోని మదర్స్ ప్రైడ్ పాఠశాలలో బుధవారం పోశమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బోనం పోసి, పోతురాజులు, అమ్మవార్ల వేషధారణలతో అలరించారు. అనంతరం విద్యార్థులు మంగళ వాయిద్యాల నడుమ బోనాలు నెత్తినెత్తుకుని ఊరేగింపుగా పోశమ్మ దేవాలయానికి తరలివెళ్లి గ్రామ దేవతలకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ దండ రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ రేగళ్ల ఉపేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు బోనాల పండుగ విశిష్టతను, గ్రామ దేవతల ప్రాముఖ్యతను, బోనం సమర్పించే సంప్రదాయాన్ని వివరించారు. పూజా కార్యక్రమాల అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వదీప్తి, సంధ్య, రజిత, సరిత, సుమలత, శ్రీవాణి, రాజేశ్వరి, పద్మ, స్రవంతి, షానాజ్ తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

